ప్రజాశక్తి

శుక్రవారం 4 అక్టోబర్ 2024 | 5 | అనంతపురం

మృతదేహంతో ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు, నాయకులు

రక్త పరీక్షల పేరుతో దోపిడీ..!

ఒక్కో టెస్టుకు రూ. 500 నుంచి 2వేల రూపాయల వరకు వసూలు

నామమాత్రంగా అధికారుల తనిఖీలు

ప్రజల జేబుకు చిల్లు

జిల్లాలో విద్య, వైద్యం రెండూ రోడ్డున పడ్డాయి. జిల్లా అధికార యంత్రాంగం ఆధిపాజ్యాలు తప్ప జనంపై స్వారీ చేస్తున్నాయి. ప్రభుత్వం రాష్ట్ర ప్రజానీకానికి తప్పని సరిగా కల్పించాల్సిన ప్రాధాన్యతాంశాల్లో విద్య, వైద్యం అత్యంత ముఖ్యమైనవి. విద్య ద్వారా అక్షరాస్యత పెరిగి మానవ వనరులు వృద్ధి చెందుతాయి. వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమవుతుంది. ప్రభుత్వం ఈ రెండింటినీ నిర్లక్ష్యం చేసిన ఫలితంగా క్షేత్ర స్థాయిలో ఇష్టారాజ్యంగా రక్తపరీక్షల పేరుతో దోపిడీ జరుగుతోంది. ప్రస్తుత జ్వరాల సీజన్‌లో డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు దోపిడీకి తెరతీసి వారిని నచ్చినట్లు పీల్చి పిప్పి చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ప్రజాశక్తి-హిందూపురం

ఇంగు తినే హంగులతో నామ కరణాలున్న ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలు తల్లిదండ్రుల బలహీనతలే ఆసరాగా వారి జేబులు గుల్ల చేస్తున్నాయి. మరో వైపు వైద్యాన్ని వ్యాపారంగా మార్చేసిన ప్రయివేటు ఆసుపత్రులు కనీసం రోగి నాడి అయినా పట్టకుండా ఎడాపెడా దోచేస్తున్నారు. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా దాదాపు 250కు పైగా ప్రయివేటు ఆసుపత్రులు ఉండగా అందులో వందకు పైబడి ఆసుపత్రులు అనంతపురం జిల్లా కేంద్రంలోనే ఉన్నాయి. ఇక హిందూపురంలో దాదాపు 40దాకా ఉన్నాయి. వీటిలో అధికశాతం ఆసుపత్రులు చిన్నపాటి సమస్యతో వెళ్లినా స్కానింగులు, రక్త పరీక్షలు అంటూ హడావిడి చేసి స్కానింగ్ సెంటర్ల పర్సంటేజీలకు కక్కుర్తి పడుతున్నాయి. కొందరు వైద్యులు కనీసం రోగి నాడి కూడా పట్టి చూడకుండా రిపోర్టుల ఆధారంగానే కుప్పలు కుప్పలు మందులు రాసేస్తున్నారు. ఏ ఆసుపత్రికి అనుమతులు ఉన్నాయో...ఏ ఆసుపత్రికి అనుమతులులేవో ఎవరికి అర్థం కావడం లేదు. వైద్యులు చెప్పిందే వేదం. ఆస్పత్రికి వెళ్లిన రోగిని వివిధ రకాల రక్తపరీక్షలు చేయించుకురావాలంటూ సూచిస్తారు. ల్యాబొరేటరికి వెళ్తే వారు నిలువునా దోచుకుంటున్నారు. జిల్లాలో చాలా చోట్ల అనధికారిక రక్త పరీక్షా కేంద్రాలు నడుస్తున్నాయి. అనుమతులు లేక పోయినా అధికారుల సహకారంతో ఆయా కేంద్రాలు సాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కేవలం నిర్వాహకులు ఆయా ల్యాబ్‌లలో ఆరు నెలలు మాత్రమే పని చేసి ఆ తర్వాత ప్రాంతాల్లో ల్యాబొరేటరీలు ఏర్పాటు చేసుకుంటారు. వీరికి ఏ అర్హత ఉండదు. చాలా చోట్ల సహాయకులుగా చేరేవారే రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. ఇక ప్రయివేటు ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న ల్యాబ్‌లో టెక్నీషియన్లకు సరైన అర్హత లేకపోయినా వైద్యులు వారి వద్దనే రక్తపరీక్షలు చేయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సాధారణ రక్త పరీక్షలు చేయాలంటే డిఎంఎల్‌టి, డిఎస్‌బిఎంఎల్‌టి, ఎంఎస్‌బిఎల్‌టి పూర్తి చేయాలి. చాలా మందికి అర్హత లేకపోయినా ప్రయివేటు కేంద్రాల్లో పని చేస్తున్నారు. ప్రతి కేంద్రంలో ఆయా పరీక్షలకు సంబంధించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఇలాంటి సూచిక బోర్డులు ఎక్కడా కనిపించవు. అలాంటి ల్యాబ్‌లలో రక్తపరీక్షలు చేయించుకుని తప్పుడు ఫలితాలు రావడం వల్ల తమకేదో రోగం ఉందని కొందరు కుంగిపోతున్నారు. అదే మరో కేంద్రంలో పరీక్ష చేయించుకుంటే ఎలాంటి అనారోగ్యం లేదని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్న సంఘటనలు కోకొల్లలు. కొన్ని ప్రయివేటు ఆసుపత్రులు వాటికి అనుబంధంగా ఉన్న ల్యాబొరేటరీల్లోనే పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తారు.

ఆర్థికంగా పీల్చి పిప్పి చేస్తున్న ల్యాబ్ నిర్వాహకులు

చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ప్రయివేటు ఆరోగ్య కేంద్రానికి వెళ్తే రోగుల బలహీనతను సొమ్ము చేసుకుంటారు. ధనార్జనే ధ్యేయంగా ఆరోగ్య సమస్య లేకపోయినా లేని పోని అపోహలు తలెత్తేలా అన్ని రకాల రక్తపరీక్షలు చేయించి రోగుల జేబులు ఖాళీ చేయిస్తున్నారు. అందులో వైద్యులకు భారీగా పర్సంటేజీలు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఒక్కో రక్త పరీక్షకు రూ.500 నుంచి 2వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. ఒక వైద్యుడి వద్ద చేయించిన రక్త పరీక్షలను మరో డాక్టరు తిరస్కరిస్తారు. మళ్లీ చేయించుకోవాలని సూచిస్తారు. దీంతో రోగి ఆర్థికంగా చితికి పోతున్నాడు. జిల్లాలో ఈ ప్రయివేటు ల్యాబొరేటరీలను అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో సుమారు 6వందలకు పైగా ఈ రక్త పరీక్షా కేంద్రాలున్నాయి. ఎటువంటి అనుమతి లేని పలు రక్తపరీక్షా కేంద్రాలను తనిఖీలు చేయకపోవడంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

సిండికేట్‌గా ఏర్పడిన నిర్వాహకులు

వ్యాధి నిర్ధారణ కోసం వెళ్తే గతంలో ఒక్కో డయాగ్నోస్టిక్ కేంద్రంలో అక్కడ ఉన్న వైద్య పరికరాల నైపుణ్యతను బట్టి ఈ ధరలు ఉండేవి. ఈ నేపథ్యంలో తక్కువ ఫీజులు తీసుకునే డయాగ్నోస్టిక్ కేంద్రాలకు రోగులు ఎక్కువగా వెళ్లేవారు. గత మూడు నెలలుగా ఇప్పుడు ఎక్కడ చూసినా ఒకే రకమైన ఫీజులు తీసుకుంటున్నారు. ఫీజుల వసూలుకు ఒక నిబద్ధత, నియంత్రణ అనేది లేకుండా పోయింది. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నా ఈ సెంటర్లను నియంత్రించే అధికారం తమకు లేదని వారు చేతులెత్తేసే పరిస్థితి కనిపిస్తోంది. చట్టంలో లొసుగులను ఆసరా చేసుకుని అడ్డగోలుగా దోస్తున్నారని, నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రోగులతో వైద్యుల చెలగాటం...?

ప్రయివేటు డయాగ్నోస్టిక్ సెంటర్ల దోపిడీకి తోడు వైద్యులు రోగులతో చెలగాటమాడుతున్నారు. తక్కువ ధర ఉన్న సెంటర్లకు వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటే ఆ ఫలితాలను రెఫర్ చేసిన వైద్యులు అంగీకరించడం లేదు. రక్త, మూత్ర పరీక్షలు సదరు ప్రయవేటు అసుపత్రికి అనుబంధంగానే ఎక్కువగా నిర్వహిస్తుంటారు. అంతే కాకుండా డాక్టర్లకు డయాగ్నోస్టిక్ సెంటర్లకు విడదీయరాని కమీషన్ల బంధం ఉందనేది జగమెరిగిన సత్యం. ఫలానా డయాగ్నోస్టిక్ సెంటర్‌కే వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని కొందరు వైద్యులు రోగులకు ఆర్డర్లు వేస్తుంటారు. వారు చెప్పినట్లు వినక ఇతర సెంటర్లకు వెళ్తే వ్యాధి నిర్ధారణ సరిగా లేదని వంకలు పెట్టడం పరిపాటిగా మారింది. వ్యాధి నిర్ధారణ ఎలా ఉన్నా ఫరావా లేదు.. తమకు కమీషన్లు వస్తే చాలనుకునే వైద్యులు కోకొల్లలు ఉన్నారు.

నియంత్రించే చట్టమే లేదా..?

ప్రయివేటు డయాగ్నోస్టిక్ సెంటర్లలో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తుంటే ప్రభుత్వ అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి. ఈ విషయమై వారిని అడిగితే తామేమీ చేయలేమనే నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు. డీఆర్‌పి చట్టంలో చర్యలు తీసుకోవడానికి ఎలాంటి నిబంధనలూ లేవని చెబుతున్నారు. ఫీజు ఎంత వసూలు చేస్తున్నారనేది కాదని, వసూలు చేస్తున్నది డయాగ్నోస్టిక్ సెంటర్‌లోగాని, ప్రయివేటు దవాఖానల్లోగానీ ప్రదర్శిస్తున్నారా...? లేదా చూడాలని మాత్రమే చట్టంలో ఉందని అధికారులు చెబుతున్నారు. చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకుని బరితెగిస్తున్న డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకుల చర్యలను అరికట్టేదెవరని రోగులు ప్రశ్నిస్తున్నారు. అది డయాగ్నోస్టిక్ సెంటర్ అయినా ప్రయివేటు దవాఖానా అయినా అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు ఏంటి...?, వాటి నైపుణ్యత ఏ స్థితిలో ఉంది...?, వాటి ద్వారా నిర్ధారిస్తున్న వ్యాధుల నివేదికల స్థితి ఏంటనేది పరిశీలించి వాటిని బట్టి ఒక నిర్ధిష్టమైన ఫీజులు నిర్ధారించేందుకు రాష్ట్ర స్థాయిలో ఒక కమిటీ వేస్తే బాగుంటుందని, అలాంటప్పుడే రోగులకు న్యాయం జరుగుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

అడ్డగోలుగా దోచుకుంటున్నారు



ప్రయివేటు డయాగ్నోస్టిక్ సెంటర్లలో అడ్డగోలుగా దోచుకుంటున్నారు. గతంలో కొన్ని సెంటర్లలో ఫీజులు తక్కువ ఉండేవి. ఆయా సెంటర్లలో ఉండే ఎక్విప్‌మెంట్స్‌ను బట్టి ఫీజులు తీసుకునేవారు. చిన్న, పెద్ద డయాగ్నోస్టిక్ సెంటర్ ఏదైనా ఒకే రకమైన ఫీజులు వసూలు చేస్తున్నారు. అసోసియేషన్ పేరుతో నిర్వాహకులంతా సిండికేట్ అయ్యారు. దేనికి ఎంత తీసుకోవాలో నిర్ణయించుకున్నారు. ఇంతకంటే తక్కువ ఫీజు తీసుకుంటే రూ.5 లక్షలు జరిమానా విధించాలని నిబంధన పెట్టుకున్నారు. ఇది పేదల మీద విపరీతమైన ప్రభావం చూపుతోంది. వ్యాధి నిర్ధారణ కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఫీజులు నియంత్రించకుంటే పేదలు తమ రోగాలకే ఉన్నదంతా సమర్పించుకోవల్సి వస్తుంది. అప్పుల పాలు కాక తప్పదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి డయాగ్నోస్టిక్ సెంటర్ల చర్యలను నియంత్రించాల్సిన అవసరం ఉంది.

ఇంతియాజ్,
సిపిఎం జిల్లా కార్యదర్శి

సూదిమందు వికటించి వ్యక్తి మృతి

నార్పల ప్రాథమిక వైద్యశాలలో ఘటన
మృతదేహంతో బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - నార్పల

నార్పల ప్రాథమిక వైద్యశాలలో ఇంజక్షన్ వికటించి వ్యక్తి మృతిచెందాడు. గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నైట్‌డ్యూటీలో ఉన్న నర్స్ భర్త సూదిమందు వేయడం వల్లనే తన భర్త మృతిచెందాడని మృతుని భార్యతో పాటు, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి మృతుని బంధువులు, వైద్యసిబ్బంది తెలిపిన వివరాలు...

మండల కేంద్రంలోని బేల్దారి కాలనీకి చెందిన కుళ్లాయప్ప (38) గురువారం అర్ధరాత్రి అస్వస్థతకు గురికావటంతో తెల్లవారుజామున 3 గంటల సమయంలో కుటుంబ సభ్యులు నార్పల ప్రాథమిక వైద్యశాలకు తీసుకుని వచ్చారు. అక్కడ కుళ్లాయప్పకు ఇంజక్షన్ వేశారు. కొద్ది సేపటికే అతను మృతిచెందాడు. వైద్యశాలలో నైట్ డ్యూటీలో ఉన్న నర్సు(ఎఫ్ఎన్ఒ) భర్త ఇంజక్షన్ వేయడం వల్లనే తన భర్త మృతిచెందాడని మృతుని భార్య, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు వారు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. అయితే ఇంజక్షన్ తానే వేశానని తనకు ఆరోగ్యం బాగా లేకపోతే తన భర్త తోడుగా వచ్చాడని నర్సు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎవరు ఇంజక్షన్ వేశారో తెలుసుకోవడానికి పోలీసులు వైద్యశాలలోని సిసి కెమెరా పుటేజీలను పరిశీలించడానికి ప్రయత్నించగా అవి పనిచేయడం లేదని వైద్య సిబ్బంది తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న శింగనమల సిఐ కౌలుట్లయ్య, డాక్టర్ ప్రవీణ్ కుమార్ వైద్య సిబ్బందితో వివరాలు సేకరించారు. మృతునిభార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి : వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో మృతిచెందిన నిరుపేద కుళ్లాయప్ప కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పిఎస్, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా నాయకులు పుల్లప్ప, గంగాధర్ మాట్లాడుతూ కుళ్లాయప్పకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని ఆ పిల్లలను ప్రభుత్వమే రెసిడెన్షియల్ పాఠశాలలో చదివించాలని డిమాండ్ చేశారు. నార్పల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రలోని జరిగిన సంఘటన పై స్పందించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ బాధిత కుటుంబంతో ఫోన్లో మాట్లాడారు. కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది అని భరోసా ఇచ్చారు. ఈ ఘటనకు పాల్పడిన సిబ్బంది మీద చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎంపీ 'అంబికా'

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. అనంతపురం పార్లమెంట్ సభ్యులుగా తొలిసారి ఎన్నికైన అంబికా లక్ష్మీనారాయణ ఇప్పటికే కేంద్ర ఒబిసి, సిల్క్ బోర్డు సంక్షేమ సభ్యులుగా ఉండగా, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా నియమించింది. దీంతో ఎంపీకున్న బాధ్యతలు మరింత పెరిగాయి. లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీకి బసవరాజ్ బొమ్మాయి చైర్మన్‌గా నియామకం కాగా, కమిటీ సభ్యులుగా లోక్ సభకు చెందిన 21 మంది ఎంపీలు, రాజ్యసభకు చెందిన 10 మంది ఎంపీలు ఉంటారు. వీరిలో ఒకరిగా అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను నియమించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా మాట్లాడుతూ కేంద్ర లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా అవకాశం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపీ పార్థసారథి, తదితరులు

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

బ్యుటీషియన్, పార్లర్ మేనేజ్‌మెంట్ శిక్షణ ముగింపు సమావేశంలో ఎంపీ

ప్రజాశక్తి - పెనుకొండ

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎంపీ పార్థసారధి అన్నారు. త్రిపుర రిసార్ట్ యాజమాని డాక్టర్ గోపీనాథ్ ఆధ్వర్యంలో ఉచిత బ్యూటిషన్, పార్లర్ మేనేజ్మెంట్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గురువారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిందూపురం పార్లమెంటు సభ్యులు బికే పార్థసారథి, జిఎం శేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బ్యూటిషన్ పై మహిళలు ఎక్కువ మక్కువ చూపిస్తారని ఆ రంగంలో శిక్షణ పూర్తి చేసుకోవడం శుభ పరిణామం అని అన్నారు. కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ఈ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలను త్రిపుర రిసార్ట్ యజమాని గోపీనాథ్ నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. నిరుద్యోగ యువతకు ఉపయోగపడే ఇలాంటి శిక్షణ అందించడం గొప్ప విషయం అన్నారు. చెన్నై నుంచి వచ్చిన కరుణ ఈ బ్యూటిషన్ కోర్సు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, అంగడి రామాంజనేయులు, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకుందాం

ఎపి రైతుసంఘం నాయకుల పిలుపు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దీక్షలో పాల్గొన్న రైతుసంఘాల నాయకులు

విశాఖ ఉక్కు పరిశ్రమను కాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి (సిపిఎం) చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి (సిపిఐ) సి.మల్లికార్జున పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కును ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల జిల్లా సమితి కన్వీనర్ డి.చిన్నప్పయాదవ్ అధ్యక్షతన ఈనెల 1వ తేదీన విద్యార్థి సంఘాలు, కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ ముందు చేపట్టిన దీక్షలు గురువారం కూడా కొనసాగాయి. ముందుగా లఖీంపూరీ కాల్పుల ఘటనలో మృతిచెందిన రైతులకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో ఆత్మ బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరించాలని చూడటం బాధాకరమన్నారు. నాలుగేళ్ల క్రితం మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రయివేటీకరిస్తామని చెప్పినప్పటి నుంచి కార్మికులు పోరాటాలు చేస్తూనే ఉన్నారన్నారు. అంతేగాకుండా ఈమధ్యకాలంలో దాదాపు 4,200 మంది కార్మికులను తొలగించాలని ప్రకటనలు చేస్తూ కార్మిక కుటుంబాలను గందరగోళానికి గురి చేయడం మంచిది కాదన్నారు. కార్మికుల జీవితాలతో ఆటలాడుతున్న బిజెపి ప్రభుత్వం కుటిల రాజకీయాలను మానుకోవాలన్నారు. ఇప్పటికైనా విశాఖ ఉక్కుకు సొంత గనులు ఏర్పాటు చేయడంతోపాటు పరిశ్రమను ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగిస్తామని చెప్పేంత వరకూ ఆందోళనలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్, నాయకులు కృష్ణ, కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరంగయ్య, విశాఖ ఉక్కు జిల్లా జాయింట్ కన్వీనర్, రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు రాయుడు, ఎపి రైతుసంఘాల సమన్వయ సమితి నాయకులు నాగేష్, వెంకటరాముడు, బండి వెంకటరాముడు, పండ్ల తోటల రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, రైతుసంఘం జిల్లా నాయకులు రాముడు, రాజశేఖర్‌శెట్టి, రామాంజి, శ్రీనివాసులు, మాధవరెడ్డి, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు, తిరుపతికి వెళ్లి పింఛను సొమ్ము అందజేత

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందజేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ హరీష్

మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బచ్చులప్పగారి శేఖర్‌కు రూ.6వేల పింఛన్ సొమ్మును సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ హరీష్ బెంగళూరుకు వెళ్లి అందజేశారు. శేఖర్‌కు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో 15 రోజుల నుంచి బెంగళూరులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. విషయం తెలుసుకున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ హరీష్ బెంగళూరులోని చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి పింఛన్ సొమ్మును అందజేశారు. దీంతో కుటుంబ సభ్యులు సచివాలయ ఇంజనీర్ అసిస్టెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందజేయడంతో సర్పంచి సందీప్‌కుమార్ ఇంజినీర్ అసిస్టెంట్‌ను అభినందించారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ సొమ్మును అందజేస్తున్న పంచాయతీ సెక్రటరీ వెంకటనాయుడు

పుట్లూరు : మండల పరిధిలోని బాలాపురం పంచాయతీ సెక్రటరీ వెంకటనాయుడు తిరుపతికి వెళ్లి బాధితులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. బాలాపురం పంచాయతీ పరిధిలోని పి.చింతలపల్లి గ్రామానికి చెందిన మానసిక వికలాంగురాలు మూలి రమాదేవి తిరుపతిలోని రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న పంచాయతీ సెక్రటరీ తన సొంత ఖర్చులతో తిరుపతికి వెళ్లి బాధితురాలికి పింఛన్ సొమ్ము అందజేశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు పంచాయతీ సెక్రటరీకి కృతజ్ఞతలు తెలిపారు.

సకాలంలో ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన పూర్తి చేయాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సకాలంలో అసైన్ ల్యాండ్స్ ఫ్రీహోల్డ్ పరిశీలనను పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి రెవెన్యూ (భూములు) శాఖ 22-ఎ నుంచి ఫ్రీహోల్డ్, తొలగించిన భూముల రీ-వెరిఫికేషన్ ప్రక్రియ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్‌ఎస్ తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్, డిఆర్‌ఓ, ఆర్‌డిఒ, తహశీల్దార్, డివిజనల్ సర్వేయర్లు, జిల్లా రిజిస్టర్, ఎలక్షన్ సెల్ సిబ్బంది, ల్యాండ్ సెక్షన్ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 34.485.89 ఎకరాల భూమికి సంబంధించి అక్టోబర్ 5వ తేదీలోపు అసైన్ ల్యాండ్స్ ఫ్రీహోల్డ్ పరిశీలన ప్రక్రియను పూర్తిచేసి సంబంధించిన రిపోర్టులను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఫ్రీహోల్డ్ అయి ల్యాండ్ రిజిస్ట్రేషన్స్ జరిగిన 178.73 ఎకరాల భూమికి సంబంధించి పునఃపరిశీలన ప్రక్రియ ఇప్పటివరకు పూర్తయిందని తెలిపారు. జిల్లాలో పునఃపరిశీలన ప్రక్రియను సకాలంలో పూర్తిచేయాలని, ఏదైనా కారణాలు, ఇబ్బందులు ఉంటే తెలపాలని సూచించారు. కుందుర్పి, పామిడి మండలాలు ఈ ప్రక్రియలో చాలా వెనకబడి ఉన్నాయని పేర్కొన్నారు. అసైన్ ల్యాండ్స్ ఫ్రీహోల్డ్ పరిశీలన ప్రక్రియను మొదటి ప్రాధాన్యతగా చూడాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్‌ఎస్) కు సంబంధించి కలెక్టరేట్, ప్రతి ఆర్డీఓ కార్యాలయం, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల్లో ప్రజలకు అవసరమైన 100 ముఖ్యమైన సేవలకు సంబంధించిన బోర్డులను ప్రదర్శించాలన్నారు. అలాగే నగరపాలక సంస్థ కార్పొరేషన్ కార్యాలయంలో, మున్సిపాలిటీ కార్యాలయాలలో ముఖ్యమైన సేవల వివరాలు, పరిష్కరించే బోర్డులను ప్రదర్శించాలన్నారు. కార్యాలయాల్లో 100 సేవలపై ఏర్పాటు చేసిన బోర్డుల ఫొటోలను కలెక్టర్ కార్యాలయానికి పంపాలని తెలిపారు. గుంతకల్లు ఆర్డీవో కార్యాలయంలో పిజిఆర్‌ఎస్ ఫిర్యాదులు తక్కువగా ఉన్నాయని, కానీ రీఓపెన్ కేసులు ఎక్కువగా ఉన్నాయని, ఇవి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సర్వే కి సంబంధించి రాబోయే రోజుల్లో ప్రభుత్వం నుండి దిశా, నిర్దేశాలు వస్తాయని తెలిపారు. తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, విఆర్ఓ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ తదితర సిబ్బంది బదిలీలు అయ్యారని, పింఛన్ పంపిణీ కార్యక్రమం ఉన్నందున ఈరోజు అందరూ విధుల్లో చేరే విధంగా చూడాలన్నారు. బదిలీలకు సంబంధించి వ్యక్తిగత, గ్రీవెన్స్, అనారోగ్య కారణాలు సంబంధించి మీరిచ్చిన అర్జీలను పరిశీలించి వాటిలో నిజాయితీగా ఉన్న వాటిని ప్రభుత్వ నిబంధనల మేరకు బదిలీలు చేస్తామన్నారు. తర్వాత ఎలాంటి బదిలీలకు ఆస్కారం ఉండదని తెలిపారు. కాబట్టి మీకు బదిలీ చేసిన ప్రదేశాల్లో వెంటనే జాయిన్ కావాలని తెలిపారు. మీరు వెంటనే కార్యాలయంలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు పథకాలు, పనులను అమలయ్యే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒలు బాధ్యతల స్వీకరణ

ఆత్మకూరు ఎంపిడిఒ లక్ష్మీనరసింహ

ఆత్మకూరు : మండల నూతన ఎంపిడిఒగా లక్ష్మీనరసింహస్వామి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా మంచినీరు, డ్రెయినేజీ వంటి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎంపిడిఒకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

గార్లదిన్నె : మండల నూతన ఎంపిడిఒగా యోగానందరెడ్డి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పుట్లూరు ఎంపిడిఒగా పని చేస్తున్న ఆయన బదిలీల్లో భాగంగా గార్లదిన్నెకు వచ్చి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ ఎఒ బాబా ఫక్రుద్దీన్, ఇఒఆర్‌డి వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, తదితరులు స్వాగతం పలికారు.

ప్రజాశక్తి www.prajasakti.com

సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు

రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రైతులు అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రేకులకుంట పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి సూచించారు. రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి రైతులకు అందిస్తున్న వాతావరణ సలహాలు, సూచనలు ఏవిధంగా ఉపయోగపడుతున్నాయని తెలుసుకోవడంలో భాగంగా గురువారం తాడిపత్రి మండలంలోని దిగువపల్లిలో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమకు వాట్సాప్‌లో వాతావరణ పరిస్థితుల వివరాలను మెసేజ్ రూపంలో రావడం వల్ల జాగ్రత్తలు పాటించి నష్టాన్ని అధిగమించి మంచి దిగుబడులు సాధిస్తున్నామని వివరించారు. తర్వాత పరిశోధన స్థానం వారు పంపిణీ చేసిన ఆముదం పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు, రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ ఉమాదేవి, ఆదర్శ రైతు సూర్యప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటల రైతులకు

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి : సిపిఎం

డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ఆరుతడి భూముల రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిపత్రి మండలంలో బ్రాంచ్ ఆయకట్టు కింద ఉన్న భూములకు ఎప్పటి నుంచో నీరు అందడం లేదన్నారు. అయితే ఆయా భూముల ఉన్న రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వర్తించవని చెబుతున్నారన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో ఆరుతడి భూములు ఉన్న రైతులకు పదెకరాల భూమి ఉన్నప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేవారన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయా పథకాలను వర్తించకుండా చేశారన్నారు. ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన సందర్భంగా గతంలో మాదిరే ఆరుతడి భూముల రైతులకు కూడా ప్రభుత్వ పథకాలను వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్మోహన్‌రెడ్డి, రామ్మోహన్, హనుమంతురెడ్డి, చంటి, శ్రీరాములు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలను తనిఖీ చేసిన ఆర్‌జెడి

విద్యార్థితో మాట్లాడుతున్న ఆర్‌జెడి నాగలింగారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఉన్నత విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్‌జెడి) డాక్టర్ నాగలింగారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ప్రతి తరగతి గదికీ వెళ్లి విద్యార్థులతో మమేకమై బోధనను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఛాంబర్‌కు వెళ్ల ప్రిన్సిపాల్, సిబ్బందితో చర్చించారు. విద్యార్థుల హాజరు పెంచాలని, బోధనా అభ్యసన ప్రక్రియ నమోదు, డిజి లాకర్ ఎబిసి, జాబ్ పోర్టల్, ఆయుష్మాన్ భారత్ హెల్త్‌అకౌంట్, తదితర వాటిపై చర్చించారు. విద్యార్థుల అంతర్గత పరీక్షల మార్కుల నమోదు తీరును పరిశీలించారు. మార్కులు వేసే, పరీక్షలు నిర్వహించే విషయపరంగా విద్యార్థులకు అన్యాయం జరగరాదన్నారు. బోధన సిబ్బంది ఎప్పటికప్పుడు అవసరమైన రికార్డులను అప్‌డేట్‌గా ఉంచాలన్నారు. న్యాక్ సందర్శనకు వెళ్లే ప్రక్రియ ఏ దశలో ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.రఘురామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల వ్యాకరణంపై విద్యార్థులకు శిక్షణ

విద్యార్థులకు ఆంగ్ల వ్యాకరణంపై శిక్షణ ఇస్తున్న మల్లికార్జున

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల పరిధిలోని పిల్లలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు ఉచిత ఆంగ్ల వ్యాకరణపై శిక్షణ గురువారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా విశ్రాంత ఉపన్యాసకులు (లెక్చరర్) మల్లికార్జున ఆంగ్ల వ్యాకరణపై విద్యార్థులకు సలహాలు, సూచనలు, శిక్షణ ఇచ్చారు. ఎలాంటి రుసుం లేకుండా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన మల్లికార్జునను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ తన శేష జీవితాన్ని విద్యార్థులకే అంకితం చేస్తానన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ఆంగ్ల బోధన, ఆంగ్ల వ్యాకరణంపై పట్టు సాధించాలని ధృడ సంకల్పంతో ఉండాలన్నారు. పదవ తరగతి పరీక్షల్లో వ్యాకరణం తెలిస్తే ఆంగ్లం చాలా సులభతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, గీతావాణి, హేమావతి, రామాంజనేయులు, చిన్నవన్నప్ప, చంద్రశేఖర్, సుధాబాయి, సరళాకుమారి, జయశ్రీ, గోవిందరెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

పంటల పరిశీలన

బుక్కరాయసముద్రం : మండలంలోని పసులూరు, భద్రంపల్లి, రెడ్డిపల్లి గ్రామాల్లోని సచివాలయాల్లో వ్యవసాయ, ఉద్యానవన, పట్టుపరిశ్రమకు సంబంధించిన రికార్డులను జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట నమోదు ఖచ్చితంగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి శ్యాంసుందర్, ఉద్యాన వ్యవసాయ సహాయకులు మునికుమార్, జ్యోష్ణ, నేత్రావతి, సంబంధిత భూమి యజమానులు పాల్గొన్నారు.

సిపిఎం పోరాట ఫలితమే చెత్త పన్ను రద్దు

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

గత ప్రభుత్వ హయంలో చెత్తపై పన్ను వేయడంతో సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను చైతన్యం చేసి పోరాటాలు చేయడంతోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేసిందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.శ్రీనివాసులు, పట్టణ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు తెలిపారు. గురువారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వం జీఓ196, 197, 198 ద్వారా ప్రతి ఇంటికీ రూ.60 చెత్త పన్ను వేసిందన్నారు. హోటళ్లు, షాపింగ్ మాల్స్, జనరల్ స్టోర్స్ వంటి వాటిపై అధిక వసూలు చేసిందన్నారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో అల్లాడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలపై చెత్తపన్ను మరింత భారం పెంచిందన్నారు. ఈనేపథ్యంలో చెత్తపన్నును వ్యతిరేకిస్తూ పట్టణంలోని ప్రతివార్డులో పాదయాత్ర, రిలే నిరాహార దీక్షలు, నిరవధిక నిరాహార దీక్షలు, మున్సిపల్ కౌన్సిల్ ముట్టడి వంటి అనేక రూపాల్లో ఆందోళనలను చేశామన్నారు. తమ పోరాటాలకు గత ప్రభుత్వం భయపడి తాత్కాలికంగా కొద్దిరోజులు నిలిపివేసిందన్నారు. అయితే తిరిగి ప్రజల నుంచి బలవంతంగా వసూలు చేసిందన్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పూర్తిగా రద్దు చేస్తామని ప్రకటించి పేదలకు ఊపిరిపోసిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, పట్టణ కమిటీ సభ్యులు సురేంద్ర, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రికి జెసి ప్రభాకర్‌రెడ్డి

నాయకులు, కార్యకర్తల ఘన స్వాగతం

భారీ జనసందోహం మధ్య వస్తున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

అనారోగ్యం నుంచి కోలుకుని చాలా రోజుల తర్వాత జెసి ప్రభాకర్‌రెడ్డి గురువారం తాడిపత్రికి చేరుకోవడంతో ఆయన అభిమానులు, టిడిపి కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. జెసి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి వస్తున్నట్లు తెలుసుకున్న అభిమానులు, కార్యకర్తలు భారీఎత్తున జిల్లా సరిహద్దు కరటికొండ బాట సుంకులమ్మ వద్దకు చేరుకుని భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి భారీ కాన్వాయ్‌గా తాడిపత్రికి చేరుకున్నారు. మార్గమధ్యంలో రాయలచెరువులో కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ జనసందోహంతో చేరుకుని స్వాగతించారు. అక్కడి నుంచి ర్యాలీగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం మీదుగా గృహానికి చేరుకున్నారు. జెసిపిఆర్ తీవ్రమైన అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం రెండుమాసాల విశ్రాంతి తీసుకుని పూర్తి ఆరోగ్యంగా తాడిపత్రికి చేరుకోవడంతో అభిమానుల్లో ఉత్సాహం ఉరకలేసింది. అభిమాన నాయకుడు పూర్తి ఆరోగ్యవంతుడై తిరిగి రావడం అభిమానుల్లో ఉత్సాహానికి అవధులు లేకుండా పోయాయి. దారి పొడవునా భారీ గజ మాలలు, మిరమిట్లు కొలిపే బాణాసంచా కాలుస్తూ పూలదారితో స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

యాడికి : తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డికి మండల టిడిపి నాయకులు జిల్లా సరిహద్దులోని బాట సుంకలమ్మ వద్ద ఘన స్వాగతం పలికారు. సుమారు 500 వాహనాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి రాయలచెరువులోని చందన గేట్ వద్ద భారీగా టపాసులు పేల్చారు. దారి వెంట డప్పు వాయిద్యాల నడుమ పూలు చల్లుతూ జై జేసీ అంటూ నినాదాలు చేశారు. అనంతరం తాడిపత్రికి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, క్లాస్ వన్ కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, పరిమి చరణ్, మాదాల అనిల్, రవికుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, తాంద్ర విక్రమ్, ఆదినారాయణ, తెల్లాకుల వెంకటేష్, బాలచంద్రుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్లూరు : చాలా రోజుల తర్వాత తాడిపత్రికి వస్తున్న జెసి ప్రభాకర్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు మండలం నుంచి ఆయన అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు గురువారం భారీగా తరలివెళ్లారు. మండల టిడిపి నాయకులు చవ్వా కులశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 50 వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు జిల్లా సరిహద్దులో గుత్తి సమీపంలోని బాట సుంకలమ్మ ఆలయం వద్దకు వెళ్లి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎల్‌కె.చెన్నారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, రవికుమార్‌రెడ్డి, రామమునిరెడ్డి, రామచంద్రనాయుడు, శివారెడ్డి, వాసుదేవరెడ్డి, శివనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ పప్పుశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

సబ్సిడీ పప్పుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో పంపిణీ చేస్తున్న పప్పుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శుభకర్ కోరారు. గురువారం మండల పరిధిలోని రాకెట్ల రైతు సేవాకేంద్రంలో సబ్సిడీ పప్పుశనగ విత్తన రిజిస్ట్రేషన్‌ను ఎఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పప్పుశనగ పూర్తి ధర రూ.9,400కాగా సబ్సిడీపోనూ రైతు వాటా రూ.7,050 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పప్పుశనగ కావాల్సిన రైతులు ఆయా రైతుసేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఇకపోతే వైరాంపురం గ్రామంలో చేపట్టిన పంట నమోదును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది పరిమళ, మీనాక్షి, రామ్మూర్తి, నీలిమ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : పప్పుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు మండలంలోని ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ తెలిపారు. గురువారం మండలవ్యాప్తంగా పప్పుశనగ విత్తన రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పప్పుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనగ క్వింటా ధర రూ.9,400 కాగా సబ్సిడీ రూ.2350పోనూ రూతు రూ.7,050 చెల్లించాలని కోరారు.

పుట్లూరు : మండలంలోని నల్లరేగడి భూములు ఉన్న రైతులు పప్పుశనగ విత్తనాల కోసం శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎఒ కాత్యాయని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ పరిధిలోని రైతు సేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడికి సాయం

నిత్యావసర సరుకులు అందజేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం

అనారోగ్యంతో బాధపడుతున్న రాయదుర్గం ప్రాంతానికి చెందిన మల్లికార్జునకు అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, స్వధర్మ సేవా ట్రస్టు సంయుక్తంగా గురువారం ఆర్థికసాయం అందజేశారు. రాయదుర్గం ప్రాంతానికి చెందిన మల్లికార్జున కడుపునొప్పితో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. కుటుంబ పరిస్థితులు అంతంత మాత్రమే ఉండటంతో ఆర్థికసాయం కోసం ఎదురు చూశాడు. విషయం స్వధర్మ సేవా ట్రస్టు వ్యవస్థాపకులు కలుగోడు మనోజ్‌కుమార్‌కు తెలియడంతో రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే నెలరోజులపాటు ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వెళ్తున్న సమయంలో నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి రెండు నెలలకు సరిపడా 34 రకాల వస్తువులతో పాటు ఒక బియ్యం ప్యాకెట్‌ను అందించారు. ఈ కార్యక్రమానికి ట్రస్టు సభ్యులు పురుషోత్తమరెడ్డి, సతీమణి పద్మావతి సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సాయిపవన్, మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా సాకే గోవింద్

పామిడి : ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా మండలంలోని గజరాంపల్లి గ్రామానికి చెందిన సాకే గోవింద నియమితులయ్యారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తానన్నారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, గుంతకల్లు రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, పామిడి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్, నాయకులు ఆర్‌ఆర్.రమేష్‌క రాజేష్‌నాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు.

కొనసాగిన 'పొలం పిలుస్తోంది'

అనంతపురం రూరల్ మండలంలో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఆలమూరు, కట్టకిందపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన కంది పంటను అధికారులు గురువారం పరిశీలించారు. తర్వాత తీపి నారింజ, రెడ్‌గ్రామ్ క్షేత్రాన్ని సందర్శించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జె.శశికళ, వ్యవసాయ విస్తరణ అధికారి మురళి, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల పరిధిలోని అరకటివేముల, సూరేపల్లి గ్రామాల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు చెంగళరాయుడు ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మొక్కజొన్న, ఆముదం పంటలను పరిశీలించి, అందులో వచ్చే కత్తెర పురుగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. ప్రస్తుతం రబీలో సాగవుతున్న పప్పుశనగ, తదితర పంటలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ హరి, విహెచ్ఎ ఆదినారాయణ, ఎహెచ్ఎ శ్రీనివాసులు, ఎంపిఇఒ సుమతి, రైతులు పాల్గొన్నారు.

పుట్లూరు మండలంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోని గడేకల్లు, ఎన్.తిమ్మాపురం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కంది, జొన్నపంటను పరిశీలించారు. తర్వాత పంటలను చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. అలాగే పప్పుశనగ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ రాఘవేంద్ర, రైతులు, రైతుసేవా, వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగరాజు

'ప్రజావేదిక' ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

కమిషనర్ నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అలాగే ప్రజా వేదిక దర్బార్ నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేందుకు ఆయా విభాగాధికారులు చర్యలు చేపట్టాలని కమిషనర్ నాగరాజు అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని కమిషనర్ ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సమయానికి హాజరు కావాలని, ఖచ్చితంగా మూమెంట్ రిజిస్టర్ నిర్వహించాలని కోరారు ముఖ్యమంత్రి మంత్రుల కార్యాలయానిక వచ్చే ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చే ఫిర్యాదులను, యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వరమే పరిష్కరంచాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో నిర్వహించే మీకోసం కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను సమయానికి పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఒలు సతీష్‌కుమార్, మేనేజర్ లక్ష్మీదేవి, ఎసిపి మారుతీప్రసాద్, హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తి, మెప్మా టిపిఒ విశ్వజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించాలని వినతి

ఉరవకొండ : పట్టణంలోని వీరశైవుల రుద్రభూమిలో కనీస మౌలిక వసతులు కల్పించాలని ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులు కోరారు. ఈ సందరస్భంగా గురువారం నిర్వహించిన గ్రామసభలో సర్పంచి లలితమ్మ, కార్యదర్శి గౌస్‌సాహెబ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని లత్తవరం రోడ్డు (సోమన్న కుంట) పక్కన ఉన్న వీరశైవుల రుద్రభూమిలో కనీస మౌలిక వసతులు లేవన్నారు. వెంటనే నీటి సౌకర్యం, లైట్లు, ప్రహరి నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సంఘం నాయకులు నాగన్న గౌడ్, గంగాధర్, మోపిడి చంద్ర, పాటిల్ నిరంజన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల బదిలీ

యల్లనూరు : యల్లనూరు మండలంలో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులు గురువారం బదిలీ అయ్యారు. ఎంపిడిఒ వీరరాజు, మండల విస్తరణ అధికారి విజయశేఖర్‌నాయుడు, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శులు గీత, ఉమాదేవి, కృష్ణవేణి, గంగాదేవి, సుజాతను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్వర్వులు జారీ చేశారు.

జిల్లాస్థాయి చెకుముకి సంబరాలకు విద్యార్థుల ఎంపిక

అనంతపురం కలెక్టరేట్ : అక్టోబర్ 27న జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లాస్థాయి చెకుముకి సంబరాలకు అనంతపురం నగరం నుంచి రెండు టీములు ఎంపికైనట్లు జెవివి నగర అధ్యక్షులు రామిరెడ్డి, చెకుముకి కన్వీనర్ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ స్కూళ్ల కేటగిరీలో రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు కె.యశిక, బి.వినయ్‌కుమార్, బి.హర్షవర్ధన్, ప్రయివేట్ స్కూళ్ల కేటగిరిలో లక్ష్మీ సినర్జీ విద్యార్థులు టి.జోత్స్నశ్రీ, ఎం.రుషిత, వి.సూర్యనారాయణరెడ్డిని ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరంతా జిల్లాస్థాయి చెకుముకి సంబరాల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

5న పిఎం కిసాన్ నిధులు విడుదల

అనంతపురం : పిఎం కిసాన్ ఉత్సవ్ దివస్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈనెల 5న పీఎం కిసాన్ లబ్ధిదారులకు 18వ విడత డబ్బులను రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి యు.ఉమామామహేశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2,79,161 మంది రైతులకు రూ.55.83 కోట్ల లబ్ధి చేకూరనున్నట్లు తెలిపారు.

చెర్లోపల్లిలో గ్రామసభ

పుట్లూరు : మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం కింద 2025-26 సంవత్సరంలో ఏఏ పనులు గుర్తించాలనే విషయాలపై చర్చించారు. ఈ గ్రామసభలో ఎపిఒ చెన్నకేశవులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు : డీఎస్పీ

మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశులు

శింగనమల : మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణా చేస్తే కట్టిన చర్యలు తీసుకోవాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు మండల పోలీసులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మండల పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సిఐ కౌలుట్లయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు

కార్మికులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

బొమ్మనహాల్ : మండలంలోని శ్రీధర్‌ఘట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యులు రాజకుమార్, గీతా భార్గవి కలిసి బిపి, షుగర్ వంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఒ శివప్రసాద్, సూపర్‌వైజర్ భారతి, ఆరోగ్య కార్యకర్తలు అలివేలమ్మ, గౌతమి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగింపు

గుత్తి : మండలంలోని పి.యర్రగుడి గ్రామం నుంచి ఈశ్వరపల్లికి గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న కంపచెట్లను గురువారం తొలగించారు. రహదారికి ఇరువైపులా కంపచెట్లు, ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో ప్రజలు గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడేవారు. ఇటీవల ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో గ్రామ సర్పంచి ఎం.పాపన్న సమస్యను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు గుమ్మనూరు నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చొరవతో జెసిబి ద్వారా రహదారి ఇరువైపులా కంపచెట్లు, ముళ్లపొదలను తొలగించి శుభ్రం చేశారు. సమస్య పరిష్కరించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పన్నులు వందశాతం వసూలు చేయాలి

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని అన్నివార్డుల్లో వందశాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా సూచించారు. గురువారం పట్టణంలోని సచివాలయాలను తనిఖీ చేసి హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయి పడ్డ ఇంటి పన్నులు, నీటి పన్నులను వసూలు చేయాలన్నారు. అనంతరం ప్రత్యేక సిబ్బందితో కలిసి వెళ్లి ఆస్తుపన్నుల వసూళ్లను పర్యవేక్షించారు. ప్రజలు పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

గుండెపోటుతో వైస్ ఎంపిపి మృతి

మృతిచెందిన రంగయ్య (పాతచిత్రం)

యల్లనూరు : మండల పరిధిలోని నేర్జంపల్లి గ్రామానికి చెందిన వైస్ ఎంపిపి రంగయ్య (55) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. వైసిపి సీనియర్ నాయకులుగా రంగయ్య మండల వాసులకు సుపరిచితుడే. అలాంటి ఆయన మృతిచెందడంతో మండల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా పలువురు వైసిపి నాయకులు ఆయన మృతికి నివాళులర్పించారు.